ఇంటర్ ఫలితాలపై దృష్టి సారించాలి

గన్‌ఫౌండ్రీ: రాబోయే ఇంటర్ వార్షిక ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ కృష్ణా ఆదిత్య కోరారు. ఈ మేరకు మంగళవారం ఇంటర్‌బోర్డు కార్యాలయంలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులు ఫెయిల్ కాకుండా దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నారాయణ, ప్రధాన కార్యదర్శి గోంటి రవి, ఉపాధ్యక్షులు హర్షం జనార్దన్ పాల్గొన్నారు.

లక్కీ డ్రాలో పర్వేజ్ అహ్మద్‌కు రూ.5లక్షలు



సాక్షి,సిటీబ్యూరో: నుమాయిష్‌లో జిందా తిలిస్మాత్ ప్రాడక్టు కొన్న వారికి లక్కీ డ్రా కూపన్లు అందజేశారు. 2025 సంవత్సరానికి గాను ప్రథమ బంపర్ ప్రైజ్ కింద రూ.5లక్షలు పర్వేజ్ అహ్మద్ గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతి కింద ఇక్బాల్ రెహ్మాన్ రాయల్ ఎన్ ఫీల్డ్, తృతీయ బహుమతి కింద హమీద్ సుజుకీ బర్గ్‌మాన్ గెలచుకున్నారు. ప్రోత్సాహక బహుమతులను జి.శ్రీనివాస్, శరత్, మన్నా ఖాన్, స్పందన కంటి, ఫయాజ్ అహ్మద్ గెలుచుకున్నారు. ఒవైస్ ఫారూఖీ, సాద్ ఫారూఖీ ముఖ్యఅతిథిలుగా హాజయ్యారు. సుహైల్ ఫారూఖీ, అమ్మార్ ఫారూఖీ విజేతలను అభినందించారు.

చదువుతోనే ఆర్థిక ఎదుగుదల సాధ్యం



నోట్ పుస్తకాలు అందజేస్తున్న నరహరిచారి, శ్రీనివాస్ గుప్తా, మంగి కిషోర్‌కుమార్

జియాగూడ: చదువుతోనే ఆర్థిక ఎదుగుదల సాధ్యమని జియాగూడ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నరహరిచారి, గ్రేటర్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కోషోర్‌కుమార్ అన్నారు. మంగళవారం దుర్గానగర్‌లోని భారత అభ్యుదయ ఉన్నత పాఠశాలలో 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రంగ పరందాములు, అనిత, దేవేందర్ సాగర్, ప్రకాష్, ఆకారం శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులకు సత్కారం



అఫ్జల్‌గంజ్: ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి ఆర్.సురేందర్‌రెడ్డి, ఎలక్ట్రిసిటీ కన్వీనర్ ఆర్.సుఖేష్‌రెడ్డి, ఆర్థిక సంఘం అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్, ఇతర సభ్యులు రాజేశ్వర్, శంకర్‌లాల్‌ను రామాయణమేళా చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. 46 రోజుల పాటు ఎగ్జిబిషన్‌ను విజయవంతంగా నిర్వహించిన సొసైటీ ప్రతినిధులను ఆయన సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా గోవింద్‌రాఠి మాట్లాడుతూ..విద్యారంగ అభివృద్ధికి తెలంగాణ నలుమూలలా ఎగ్జిబిషన్ సొసైటీ చేస్తున్న కృషి అమోఘమని కొనియాడారు.

మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మెథడిస్ట్ విద్యార్థులు

అఫ్జల్‌గంజ్: మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎక్స్‌పైసెస్ ఎంసెట్ వర్క్‌షాప్ నిర్వహించారు. మంగళవారం అబిడ్స్‌లోని కళాశాలలో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించి పలు విభాగాల్లో అవగాహన కల్పించారు. వీవీవీ సత్యనారాయణ న్యూఢిల్లీ ఐయూఏసీ డైరెక్టర్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీర్ ఎక్స్‌పైసెస్ ప్రాజెక్ట్‌పై విద్యార్థులకు బోధించారు. డీసీ పవర్ సప్లయ్, ఫంక్షన్ జనరేటర్, ఫ్రీక్వెన్సీ కౌంటర్లపై బోధించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభుజీ బెనకోప్, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీపతిరావు, ఈసీఈ హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాస్ బాబా, డాక్టర్ కె.అనురాధ, వీరభద్రరావు, డాక్టర్ ఎ.అరుణ్‌కుమార్, శ్రీకాంత్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ల షోబగులు



టోలిచౌకీ ఫ్లై ఓవర్ వద్ద..





రేతిబౌలి వద్ద..

ఫ్లై ఓవర్ల సుందరీకరణలో భాగంగా మెహిదీపట్నం, టోలిచౌకీ, రేతిబౌలి, మాసాబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లోని ఫ్లై ఓవర్లు కొత్త సొబగులతో అందాలు విరజిమ్ముతున్నాయి. ఫ్లై ఓవర్ కింద భాగాన్ని బల్దియా అధికారులు అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మాసాబ్ ట్యాంక్ ఫ్లై ఓవర్ వద్ద పూల బొమ్మలు, షేక్‌పేట్ నాలా ఫ్లై ఓవర్ వద్ద గుర్రాల ప్రతిమలు, ఫౌంటెన్ చూపరుల దృష్టిని ఆకట్టుకుంటున్నాయి. అలాగే రేతిబౌలి నుంచి అత్తాపూర్ వరకు ఉన్న ఫ్లై ఓవర్ పిల్లర్లపై వివిధ రకాల చిత్రాలు ఆలోచింపజేస్తున్నాయి. - గోల్కొండ



షేక్‌పేట్ ఫ్లై ఓవర్ వద్ద ఫౌంటెన్, గుర్రాలు

నాలా స్లాబ్ పనులపై సమగ్ర విచారణ చేపట్టాలి



నాలా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

అబిడ్స్: గోషామహల్ చాక్నావాడి ప్రాంతంలోని నాలా స్లాబ్ పనులపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా, స్థానిక సీపీఎం నాయకులు కూలిన నాలా ప్రాంతంలో చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గడిచిన కొద్ది కాలంలోనే నాలుగు దఫాలు ఈ నాలాపై వేసిన స్లాబ్‌లు కూలిపోయాయని వాహనాలు నాలాలో పడిపోయాని, ప్రాణాపాయం తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేపట్టడం దీనికి కారణంగా సీపీఎం ప్రాథమిక పరిశీలనలో తేలిసిందన్నారు. తక్షణమే జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సమగ్ర పరిశీలన చేపట్టాలని వారు పేర్కొన్నారు. బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నిరసనలో సీపీఎం గోషామహల్ జోన్ కన్వీనర్ పి.నాగేశ్వర్, జిల్లా, జోన్ నాయకులు కె.జంగయ్య, ఎం.బాలు, ఎం.మీనా, ఎం.శ్రావణ్, నెమ్మది గోపాల్, ఎండీ అయూబ్‌ఖాన్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



పనులు పరిశీలిస్తున్న మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్

యాకుత్‌పురా: ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ తెలిపారు. దారుషిఫా నుంచి బీబీ బజార్ మొఘల్‌పురా హోల్డా హోటల్ వరకు కొనసాగుతున్న పురాతన భవనాల కూల్చివేతల నేపథ్యంలో మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొన్ని రోజులుగా పురాతన భవనాల కూల్చివేతలు జరుగుతున్నాయన్నారు. తొలగించిన మట్టిని రోడ్లపై వేయకుండా ఎప్పటికప్పుడు తరలించాలని ప్రాజెక్టు అధికారులకు సూచించామన్నారు. ప్రధాన రహదారి కావడంతో ఉదయం కాకుండా రాత్రి వేళల్లో భవనాల కూల్చివేతలు చేపట్టాలని అధికారులకు చెప్పామన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి



గాంధీభవన్ ఎదుట ఆందోళన చేస్తున్న రెడ్డి జాగృతి ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: గత కొన్ని రోజులుగా రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టంగారి మాధవరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం గాంధీభవన్ ఎదుట రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఒక సామాజిక వర్గంపై వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తిని తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షులు ఎడ్ల ఉప్పల్‌రెడ్డి, వ్యవస్థాపక సభ్యులు దయాకర్‌రెడ్డి, సురుకంటి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం



నూతన శాఖను ప్రారంభిస్తున్న ఇస్మాయిల్ అజని

గన్‌ఫౌండ్రీ: బ్యాంకింగ్ సేవలు వినియోగదారుల మన్ననలు పొందేలా ఉండాలని హాలీవుడ్ ఫుట్‌వేర్ మేనేజింగ్ పార్టనర్ ఇస్మాయిల్ అజని అన్నారు. మంగళవారం అబిడ్స్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నూతన శాఖను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకింగ్ సేవలు ఎంతో బాగుంటాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ జోనల్ హెడ్ బడీ విశాల్, బ్రాంచ్ మేనేజర్ ఎస్.మురళి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

చాంద్రాయణగుట్ట: ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి బోయ నగేశ్ అన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని అత్యంత పురాతమైన స్వయంభూ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ మెట్ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.7 లక్షల నిధులు మంజూరు చేయడంతో మంగళవారం ఆలయ చైర్మన్ మహేశ్‌గౌడ్‌తో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీధర్, శైలేష్, రాజు ముదిరాజ్, అశోక్, వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ మహేశ్ గౌడ్ తదితరులు

క్షేత్ర సందర్శనలు పాఠ్యప్రణాళికలో కీలకం

చార్మినార్: విద్యార్థులు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా క్షేత్ర సందర్శనలు కూడా చేయాలని, అవి పాఠ్యప్రణాళికలో కీలక మని జాతీయ గణాంకాల సంచాలకులు పి.మనోహర్ అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్‌లో జాతీయ గణాంకాల కార్యాలయం ఏర్పాటు చేసిన స్టాల్‌ను సోమవారం రాత్రి ప్రభుత్వ సిటీ కాలేజి గణిత శాస్త్రం, గణాంకాల విభాగ విద్యార్థులు సందర్శించారు. డిగ్రీ, పీజీ విద్యార్థులు 35 మంది, అధ్యాపకులు జయదేవ్ రాథోడ్, రుచిత, షణ్ముఖ రావు, మనోజ్, నయోమి ఆధ్వర్యంలో ఈ క్షేత్ర సందర్శనలో పాల్గొన్నారు. విద్యార్థులకు ఎన్ఎస్ఓ సంచాలకులతో సహా ఇతర అధికారులతో ముఖాముఖి మాట్లాడే అవకాశం లభించింది. ఎన్ఎస్ఓ నిర్వహిస్తున్న పనితీరును అధికారులు విద్యార్థులకు వివరించారు.

'జూ'ను సందర్శించిన సింగపూర్ అధికారుల బృందం

బహదూర్‌పురా: ఆసియా సింహాలు, బెంగాల్ పులులు, ఒక కొమ్ముగల ఖడ్గమృగం, మౌస్ డీర్ల సంతాన ఉత్పత్తిలో విజయం సాధించి కొన్నిటిని అడవిలో విజయవంతంగా విడుదల చేయడంలో జూ పార్క్ ప్రత్యేక చొరవ తీసుకొని విజయం సాధించిందని సింగపూర్ జంతు ప్రదర్శన శాలల ప్రత్యేక ప్రాజెక్టుల వైస్ ప్రెసిడెంట్ కుమార్ పిళ్లై అన్నారు. మంగళవారం నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌ను ఆయన అధికారుల బృందంతో సందర్శించారు. తెలంగాణ జూ పార్కుల డైరెక్టర్ సునీల్ ఎస్. హిరేమత్, జూ పార్క్ క్యూరేటర్ వసంత కలిసి జూను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జూను సందర్శించడం ఇది మూడోసారి అని ప్రతిసారి ఎంతో పరిణతి సాధించిన అమోఘమైన విజయాలతో చరిత్ర సృష్టించింది అన్నారు. ఈ కార్యక్రమంలో జూ పార్క్ డిప్యూటీ క్యూరేటర్ ఎం.బర్నోబా, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ హకీమ్, అసిస్టెంట్ క్యూరేటరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ అరెస్ట్

విజయనగర్‌కాలనీ: అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ను అరెస్టు చేసిన ఘటన మంగళవారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు తెలిపిన వివరాల ప్రకారం ..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా ఇంకొల్లె గంగవరానికి చెందిన పల్లపాటి నరేంద్ర (21) గంజాయి సరఫరా చేస్తున్నాడు. హైదరాబాద్‌లో మెహిదీపట్నం అన్నపూర్ణమ్మ ఆలయం వద్ద నివాసం ఉంటున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సౌత్‌వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టప్పాచబుత్ర పోలీసులు పీఎస్ పరిధిలో గంజాయి అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 3.50 కిలోల గంజాయి, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.బాలస్వామి, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ బి.అభిలాష్, ఎస్ఐలు మహ్మద్ అంజద్ షరీఫ్, ఆర్.శరత్‌చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



సమీర్

గౌలిపురా: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా నషేమాన్‌నగర్‌కు చెందిన షేక్ సిద్దిఖ్ కుమారుడు షేక్ ఇస్మాయిల్ అలియాస్ సమీర్ (22) ఈ నెల 14న సాయంత్రం 4 గంటలకు ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయిబాబా ఆలయం, డీఎంఆర్‌ఎల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం ట్రాఫిక్–3 డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్టీ టోన్ హారన్లు, సైరన్లు, బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించి నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేశారు. సైరన్లు, బ్లాక్ ఫిల్మ్ వాడొద్దని డీసీపీ ప్రజలకు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ డ్రైవ్‌లో డెల్టా 30 అధికారి ఇ.నరసింహా నాయక్, ఎస్సైలు వి.సత్యనారాయణ, వెంకటప్ప, సంతోష్‌నగర్ ట్రాఫిక్ పీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మజ్లిస్ శాసన సభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. మంగళవారం ఆయన ఆసిఫ్‌నగర్ మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఆయన వెంట కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ తదితరులు ఉన్నారు.



చెక్కులను అందజేస్తున్న అక్బరుద్దీన్ ఒవైసీ

సింగరేణి స్టాల్‌కు ద్వితీయ బహుమతి



బహుమతిని అందుకుంటున్న సీఎండీ బలరాం

నాంపల్లి: నుమాయిష్‌లో సింగరేణి సేవా సమితి ఏర్పాటు చేసిన మహిళా శక్తి మార్కెట్..స్వయం ఉపాధి ఉత్పత్తుల స్టాల్‌కు ద్వితీయ బహుమతి లభించింది. నాంపల్లిలోని నుమాయిష్‌లో మొత్తం 2200 స్టాల్స్ ఏర్పాటు చేయగా, ఇందులో ప్రభుత్వ విభాగంలో సింగరేణి సేవా సమితి స్టాల్‌కు ఈ బహుమతి వరించింది. సోమవారం సాయంత్రం జరిగిన ముగింపు సభలో ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు ఉత్తమ స్టాల్స్‌కు బహుమతులను అందజేశారు. ఈ బహుమతిని ఈడీ (మార్కెటింగ్), జీఎం (కో ఆర్డినేషన్), సింగరేణి సేవా సమితి ఉపాధ్యక్షులు ఎస్.డి.ఎం.సుభానీ, పీఆర్వో, సేవా సమితి కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ శ్రీకాంత్, సీఎండీ ఎన్.బలరాముకు అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ..సింగరేణి స్టాల్‌కు బహుమతి ద్వారా గుర్తింపు రావడం అభినందనీయమని అన్నారు.

'విజ్ఞాన ప్రదర్శనలు మేధాశక్తిని పెంచుతాయి'



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ముఖ్యఅతిథులు, విద్యార్థులు

చార్మినార్: విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచుతాయని అప్రా హాస్పిటల్ కంటి వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్ ఖాన్, రెసిడెన్సి కాలేజ్ ఆఫ్ కంప్యూటర్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ వలీవుల్లా అన్నారు. చార్మినార్ నారాయణ స్కూల్లో జరిగిన అకాడమిక్ ఫెయిర్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఏడాది పొడవునా విద్యా భ్యాసంతో పాటు అప్పుడప్పుడు ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ స్కూల్స్ డీజీఎం గోపాల్ రెడ్డి ఏజీఎం బాల పరమేశ్వర్ కో ఆర్డినేటర్ ఆజాద్, భవాని, నూర్, ప్రిన్సిపాళ్లు తహనీయత్, సుజాత, వైస్ ప్రిన్సిపాల్, అకాడమిక్ డీన్ ఏవీ బాలకృష్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళా విశ్వవిద్యాలయంలో గెస్ట్ లెక్చర్



గెస్ట్ లెక్చర్ కార్యక్రమంలో డాక్టర్ ఆడెపు రాజేశ్వర్ తదితరులు

సుల్తాన్‌బజార్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. సెమినార్ హాల్‌లో భారత విదేశాంగ విధానం–అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఆడెపు రాజేశ్వర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా పాలిస్టియ రిసర్చ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ సంజయ్ పులిపాక విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. అంతర్జాతీయ రాజకీయాలు వేగంగా మారుతున్నాయన్నారు. పశ్చిమ దేశాల నుంచి తూర్పు దేశాలకు ఆర్థిక శక్తి మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాచార్యులు దివ్య, సోనియారాజ్, డాక్టర్ రమనిక మార్, డాక్టర్ విష్ణ్వి బాబుకుమార్ తేజస్విని, నూరిన్, డాక్టర్ రాజి, డాక్టర్ తుల రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మోదీ హయాంలో క్రీడల్లో భారత్ అగ్రగామి



ఎంపీకి మెమొంటో అందజేస్తున్న దేవర వంశీ

గోల్కొండ: మోదీ హయాంలో క్రీడల్లో భారత్ అగ్రగామిగా నిలిచిందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తాళ్లగడ్డ రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో ఛత్రపతి శివాజీ రెజ్లింగ్ చాంపియన్‌షిప్–2025ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న కుస్తీ పోటీలకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. నేడు యువకులు క్రికెట్ కాకుండా బాక్సింగ్, రెజ్లింగ్, చెస్ తదితర వ్యక్తిగత క్రీడల పట్ల ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పోటీ నిర్వాహకుడు దేవర వంశీ, గోవర్ధన్, చంద్రకాంత్ తదితరులున్నారు.

కృష్ణానదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

చందంపేట: నల్లగొండ నేరెడుగొమ్ము మండలం వైజాక్ కాలనీ సమీపంలో కృష్ణానదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన షేక్ గౌసొద్దీన్ ఈ నెల 16న తన స్నేహితులతో కలిసి వైజాక్ కాలనీకి వచ్చాడు. మర బోటులో సాగర్ వెనుక జలాల్లోకి వెళ్తుండగా..గౌసొద్దీన్ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. రెండు రోజులుగా గౌసొద్దీన్ కోసం వెతుకుతుండగా మంగళవారం అతడి మృతదేహం లభ్యమైనట్లు ఇన్‌చార్జి ఎస్ఐ సతీష్ తెలిపారు. మర బోటు నడిపిన చింతకాయల రాజుపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కెమెరాలను దొంగిలించి ఓఎల్ఎక్స్‌లో విక్రయం

ఏడుగురి అరెస్టు

నాంపల్లి: కెమెరాలను దొంగిలించి ఓఎల్ఎక్స్‌లో విక్రయిస్తున్న ఏడుగురిని మాసబ్‌ట్యాంక్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ పరశురామ్ వివరాల ప్రకారం..అంబర్‌పేట్‌కు చెందిన దాసి వంశీ(26) జూబ్లీహిల్స్‌లోని రెడాంట్స్ సంస్థల్లో పనిచేస్తున్నాడు. ఈ సంస్థలోని విలువైన కెమెరాలు, లెన్స్‌ను దొంగలించి విక్రయించాలనే పథకం వేశాడు. ఇందులో భాగంగా కుత్బుల్లాపూర్‌కు చెందిన మహ్మద్ ముజామిల్ ఫరాజ్(24), ఎం.సతీష్(27)తో కలిసి విక్రయించాలనుకున్నారు. ఈ కెమెరాలను వంశీ ఓఎల్ఎక్స్‌లో విక్రయానికి ఉంచాడు. ఈ కెమెరాలను బేగంపేటకు చెందిన రాజేశ్ మల్లిక్(24), పరిశిత్ దాస్‌ల సాయంతో ఆంధ్రప్రదేశ్ ఏలూరుకు చెందిన ఫొటోగ్రాఫర్ జోడిగండ్ల రఘుబాబు(31), చిక్కడపల్లిలో నివాసం ఉండే రాజస్తాన్‌కు చెందిన, కెమెరాలు క్రయ విక్రయాలు జరిపే వ్యాపారి ఆకాశ్‌సింగ్ (25)కు విక్రయించారు. వివిధ కెమెరాలు లెన్స్‌లను విక్రయించగా రూ.2,11,000 వచ్చాయి. వచ్చిన మొత్తంలో కొంత ఖర్చు చేసి మిగిలిన మొత్తాన్ని ఆన్‌లైన్ గేమింగ్‌కు వినియోగించాడు. మాసబ్‌ట్యాంక్‌లో నివాసముండే బాధితుడు రజినీకాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కూపిలాగితే డొంకంతా కదిలింది. ఈ కేసుతో సంబంధం ఉన్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా తామే దొంగలించినట్లుగా ఒప్పుకున్నారు. దొంగతనానికి పాల్పడిన వంశీ, మహ్మద్ ముజామిల్ ఫరాజ్, ఎం.సతీష్, రాజేశ్ మల్లిక్, పరిశిత్‌దాస్, జోడిగడ్డ రఘుబాబు, ఆకాశ్ సింగ్‌ను అరెస్టు చేశారు.